# అడ్రసు కోసం

కావాల్సిన  అడ్రసులు దొరకడం  అంత తేలికయిన విషయం  కాదు.  అదొక  పెద్ద అదృష్టం. జీవితకాలమంతా  వెతికినా కోరిన  అడ్రసులు  దొరక్క  అల్లాడిపోయిన మహానుభావులున్నారు.  ఆఖరి దశలో  అడ్రసు  తెలుసుకుని ,ఇదే  అడ్రస్సు  ఇరవై ఏళ్ళ క్రితం  దొరికుంటే  దేశాన్ని,  ప్రజల్ని ఒక వూపు వూపుండేవాడిని  గదాని  వాపోతూ వెళ్ళిపోయిన మహానీయులూ  మనకున్నారు.  అంచేత మనిషికి అదృష్టం , దురదృష్టం అనేవి కావాల్సిన అడ్రసు దొరకడం , దొరక్కపోవడం  మీద ఆధారపడుంటాయన్న మాట.

అడ్రసుల్లో  అనేక రకాలున్నాయి.  ముఖ్యంగా  రెండని రకాలు – కంటికి కనిపించేవి. కనిపించనివి  అని.  కనిపించే  అడ్రసుల్ని  తంటాలు  పడి కనుక్కోవచ్చును గానీ  కనిపించని వాటిని కనుక్కోవడం ఎలా  అనేది సమస్య,  అనుకుంటాం గాని , ఏ రకం  అడ్రసునైనా  కనిపెట్టడం  కష్టమే. కాదని  వాదించేవాళ్ళు  మా అందమైన నగరానికొచ్చి  ఒక అడ్రసు  వెతికి పెట్టండి చూద్దాం. మీక్కావల్సిన ఇంటి నెంబరు చస్తే దొరకదు.  మీ  సహనానికి  అదో పెద్ద పరీక్ష.కోపాల్ని, కోర్కెల్ని త్యజింపచేసి  కాషాయం కట్టిన మహానీయుడికి  మన  అడ్రసు కాగితం  ఇచ్చి  వెతికి  పెట్టమంటే , అడ్రసు దొరక్క, తిక్కరేగి  పోయి  కాసేపు  కాషాయాన్ని  కమిట్ మెంట్‌ని  మర్చిపోయి కారాలు మిరియాలు  నూరేసి  చక్కాపోతాడు.  జీవితమంటే  చీకటి  ఇంట్లో కాపురం  లాంటిది, అవసరమైన  వస్తువు  కోసం  ఓపిగ్గా  తడముకోవడం అని ఇంగ్లీషు ఫిలాసఫర్ ఒకాయన అభిప్రాయడ్డాడు. దాన్ని బట్టి  ఆయన అడ్రస్సులు  దొరక్క  ఎంత అలసిపోయుంటాడో వూహించండి !

చదువుకునే  రోజుల్లో  ఆవేశమే  గాని అడ్రస్సులతో  అవసరం  వుండదు.  కాలేజీ నించి బయటికి  రాగానే  మొట్టమొదటిగా వెతికే అడ్రసు  ఎంప్లాయ్‌మెంట్  ఆఫీసుది. తర్వాత ఫలానా  ఆఫీసులో  జాబ్‌కి  సిఫార్సు  చేసే మొనగాడి  అడ్రసుకోసం వేట మొదలవులుంది,  అదృష్టం  బావుంటే  అడ్రసు లభిస్తుంది.  ఉద్యోగం  వస్తుంది. తర్వాత ఘనంగా  కట్నం ఇచ్చుకోగలిగే  ఆడపిల్ల  తండ్రి  అడ్రస్సు  కోసం వెతుకులాట ప్రారంభమవుతుంది.  మానవ  జీవితంలో  అడ్రస్సుల  జాబితా  అనంతం.  అడ్రసుల్ని పట్టుకోవడం గ్రామాల్లో , పట్టణాల్లో తేలిక, నగరాల్లో కష్టం. గ్రామాల్లో అయితే

ఎవరింటికెళ్లాలో చెప్తే చాలు పనయిపోతోంది. కానీ కలకత్తా, బొంబాయి లాంటి నగరాలకెళ్ళినప్పుడు ఎంత అవస్థపడాలో అనుభవిస్తే కాని తెలీదు. అడ్రస్సులు తెలీక ఘోరమైన తపస్సులు చేసి పరమేశ్వరుడిని మెప్పించి ఆయన ప్రత్యక్షమై ' భక్తా ! నీ తపస్సుకి మెచ్చితిని . ఏం కావాలో కోరుకోమంటే " కాస్త ఈ అడ్రస్సు ఎక్కడో చెప్పండి స్వామీ అంటూ కాగితం బయటికి తీసినట్టు చెప్పుకునే జోకులు అనుభవంతో చెప్పిన సత్యాలు.

వయసులో వున్నప్పుడు ఎడా పెడా రెండు చేతుల్తో సంపాయించేసి కార్లు, మేడలు , పదవులు సంపాయించిన వారిక్కూడా దొరకని అడ్రస్సులుంటాయ్. మనశ్శాంతి లేక పగలూ రాత్రి గుళ్ళూ, గోపురాల వెంట తిరుగుతుంటారు. వాళ్ళక్కావాలిసిన అడ్రసుల్ని మానవ మాత్రులు చెప్పలేరు. కావాల్సిన అడ్రసుల్ని , మనుషుల్ని అవలీలగా పట్టుకుని పైకొచ్చిన వీళ్ళకే ఈ మనశ్శాంతి అడ్రసు దొరక్కపోవడం గొప్ప చిత్రంగా అనిపిస్తుంది. అడగలేక, చెప్పుకోలేక వాళ్ళల్లో వాళ్ళే కుమిలిపోతారు. కూలిపోతారు. అసలు మనుషులు ఆస్తికులని, నాస్తికులని విడిపోవట్టానిక్కారణం కూడా ఈ అడ్రస్సే అని నా అనుమానం . ఫలానా దేవుడు ఫలానా అడ్రసుల్లో వున్నాడనో, ఫలానా ఫోన్ నెంబర్లో వుంటాడనో ఖండితంగా ఎవరైనా చెప్పగలిగితే పాపం నాస్తికులు మాత్రం వూరుకుంటారా ? వాళ్ళ మహా సభలకి అధ్యక్షుడిగా రమ్మని వెళ్ళి ఆహ్వానించరూ ? కలదు కలండదురే , అసలు కలడో లేడో అనేట్టుగా వుంది భగవంతుడి చిరునామా సంగతి. కాని భగవంతుడిని చూసి వాళ్ళున్నారు. ఆ అడ్రసు వాళ్ళకి దొరికింది. ఒక్క ఆదిశంకరుడు , ఒక రామకృష్ణ పరమహంస, ఒక వివేకానందుకు. – వీళ్ళందరికి దొరికిన అడ్రసు మనకి ఎందువల్ల లభించడం లేదు ? ఆ మందిరంలోనో, ఈ మసీదులోనో, ఆ చర్చిలోనో వున్నాడని వాదించుకుని ఆవేశపడి , అల్లరిపాలయిపోతున్నాం. ఆనందానికి, ఆత్మశాంతికి అడ్రస్సులుండవ్. చల్లగాలి సుఖాన్ని అనుభవించగలం గాని ఇనప్పెట్టెలో దాచుకోలేం గదా ? దైవ తత్వం కూడా ఇలాంటిదే. నిలువుటద్దం ముందు నిల్చుని మన శరీరాన్ని మనం చూసుకోగలిగినట్లు, మనని మనం లోపలికి చూసుకోగలిగితే అర్ధమవుతుంది. దేవుడి అడ్రసు మనకి ఎందుకు దొరకడం లేదో ? భగవంతుడు, కేరాఫ్ ప్రతి మనిషి , పిన్ కోడ్ నెంబరు – ప్రేమ, దయ , జాలి, కరుణ , సహనం – దట్సాల్ .

------- అయ్యిపోయింది -------